సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 18 । అక్టోబర్ । 2025



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చక్రాయపేట మండలం అద్దాలమర్రి చెక్ పోస్టు సమీపంలో అమ్మవారి గుడి వద్ద పెద్ద ఎత్తున ఉన్న ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు. -10లో



ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

ఛాతీనొప్పితో వచ్చిన మహిళకు చేసిన వైద్యం వికటించి మృతి చెందడానికి కారణమైన ఆర్ఎంపీ క్లినిక్, ల్యాబ్‌ను వైద్య శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/24.4

జిల్లాలో శుక్రవారం 24.4 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఐదుగురు తహసీల్దార్లకు పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో పని చేస్తున్న ఐదుగురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా అడ్‌హాక్ పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్:383 జారీ చేసింది. కడప తహసీల్దార్ నారాయణరెడ్డి, కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డి, పోరుమామిళ్ల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పెండ్లిమర్రి తహసీల్దార్ అనూరాధ, కలెక్టరేట్ ఎఫ్–సెక్షన్ సూపరింటెండెంట్ మాధవకృష్ణారెడ్డి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందిన జాబితాలో ఉన్నారు.

21న తిరుపతి-హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 21వ తేదీన తిరుపతి–హైదరాబాదు మధ్య ప్రత్యేక రైలు నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07499 నంబరు గల రైలు మంగళవారం తిరుపతిలో సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదిగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట మీదుగా హైదరాబాదుకు మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

7న హాకీ ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హాకీ సంఘం సెక్రటరీ శేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: నవంబర్ 7న హాకీ ఇండియా 100వ వార్షికోత్సవ వేడుకలు కడపలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ సంఘం సెక్రటరీ శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో కడప హాకీ సంఘం సీనియర్ క్రీడాకారులు, కోచ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో హాకీ ఇండియా అసోసియేషన్ స్థాపించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఏపీ రాష్ట్ర అసోసియేషన్ ఆదేశాలకు జిల్లాలో ఉత్సవాలు జరపాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఆ రోజున పురుషులకు, మహిళలకు హాకీ పోటీలు నిర్వహించి సీనియర్ క్రీడాకారులను, క్రీడాకారిణులను సన్మానిస్తామని పేర్కొన్నారు.

కలం.. నిరసన గళం

కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది.. నిజాలు రాసే కలంపై కక్ష కట్టింది.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే పత్రికా స్వేచ్ఛను హరించి వేస్తోంది.. ప్రజల పక్షాన నిలిచి, వాస్తవాలు ప్రచురిస్తున్న 'సాక్షి'ని వేధింపులకు గురి చేస్తోంది.. పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తోంది.. ఈ నేపథ్యంలో కలం నిరసన గళం విప్పింది.. 'సాక్షి'కి మద్దతుగా జర్నలిస్టులు కదం తొక్కారు.. 'సాక్షి'పై అక్రమ కేసులు, వేధింపులను పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.. ఇప్పటికైనా మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.

- పత్రికా స్వేచ్ఛపై దాడి తగదంటూ ఆందోళన
- 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యల పట్ల మండిపాటు
- అక్రమ కేసులు, వేధింపులపై ఆగ్రహం
- కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజం
- కదం తొక్కిన జర్నలిస్టులు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత



కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

కడప కార్పొరేషన్: నెల్లూరులో కల్తీ మద్యం వల్ల ముగ్గురు వ్యక్తులు చనిపోయారని వార్తలు రాసినందుకు.. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ.. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రమైన కడపలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 'సాక్షి' మీడియాపై వేధింపులను పత్రికా స్వేచ్ఛపై దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నెల్లూరులో కల్తీ మద్యం వల్ల ముగ్గురు వ్యక్తులు చనిపోయారని వార్తలు రాసినందుకు ఇలా అక్రమ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. రాసిన వార్తల్లో ఏవైనా తప్పులుంటే ఆధారాలు చూపి ఖండన కోరవచ్చు, అంతేగానీ అధికారముందని అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. సాక్షి కార్యాలయాలకు వెళ్లి నోటీసుల పేరుతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మనుగడకు ఇది చాలా ప్రమాదమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 'సాక్షి' మీడియాపై అక్కసు ప్రదర్శిస్తోందన్నారు. చీటికీ, మాటికీ జర్నలిస్టులను బెదిరించేలా పోలీసులతో.. వారి ఇళ్లలో సోదాలు చేస్తూ, నోటీసులు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం మీడియా సంస్థలను కూడా విభజించి తమకు అనుకూలంగా ఉన్న మీడియాపై ఒక విధంగా, వ్యతిరేకంగా వార్తలు రాసే మీడియాపై మరొక రకంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.బాలక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులపై వేధింపులు, దాడులు నిత్యకృత్యంగా మారాయన్నారు. వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయించి వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వైఖరి సరికాదన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో మస్తాన్‌రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన కడపలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు రామాంజనేయరెడ్డి, యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి, శివరామ్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, కెమెరామెన్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు పి. జయచంద్రారెడ్డి, పాకా సురేష్, పులి సునీల్‌కుమార్, సీహెచ్ వినోద్, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, బి.మరియలు, మల్లీశ్వరి, సుజిత, శివమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వ వేధింపులను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అక్కడి అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. పులివెందులలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, ఆర్‌డీఓకు వినతి పత్రం సమర్పించారు.



డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

మైదుకూరులో..



మైదుకూరు: మైదుకూరులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అర్బన్ సీఐ కె.రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే (ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా) నియోజకవర్గ అధ్యక్షుడు కారెడ్ల కృష్ణ, ప్రింట్ మీడియా యూనియన్ అధ్యక్షుడు జి.వాసు, శ్రీపతి సుబ్బయ్య, కశెట్టి చంద్ర, బొమ్మిశెట్టి మోహన్, శేగినేని మురళి, టి.రామమోహన్, ఎల్.సుధాకర్‌రెడ్డి, ఎం.ప్రసాద్, రియాజ్ హుస్సేన్, ఎస్.గౌస్‌పీర్, రంజిత్‌కుమార్, యాపరాల ప్రసాద్, డీవీ కుమార్, సంపత్, గోశెట్టి రవీంద్ర, అనిల్ కుమార్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులరెడ్డి, సురేష్, సుబ్బరాయుడు, చొక్కం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..



కమలాపురం: కమలాపురం మండలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నల్ల రిబ్బన్ ధరించి డిప్యూటీ తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. మీడియా ప్రతినిధులు మహమ్మద్ రఫీక్, జయచంద్ర, సురేష్‌బాబు, విజయ్ బాబు, శివరామక్రిష్ణ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..



ఎర్రగుంట్ల: ఎర్రగుట్లలో ప్రింట్ మీడియా ప్రతినిధులు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సీఐ విశ్వనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లెపు శ్రీనివాసులు, విలేకర్లు హబీబ్, లక్ష్మీనారాయణ, బాలాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, బాలక్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..



జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగులోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఇక్బాల్ బాషాకు వినతిపత్రం అందించారు. జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఎస్.అబ్దుల్ బషీర్, ఎస్.మహబూబ్ హుసేన్, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణ మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో..



బద్వేలు అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట బద్వేలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ ఉదయభారతికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకటేష్, నియోజకవర్గ నాయకులు పి.సుదర్శన్‌రెడ్డి, జె.జానీసుందరం, జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు ఎ.వెంకటేష్, మోహన్‌క్రిష్ణ, రాజన్న, శేఖర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వి.వి.రమణ, అరుణ్, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, సీపీఎం నాయకులు చిన్ని, సీపీఐఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పెన్నేరు శర్మ, వీరారెడ్డి, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు సృజన శ్రీను, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు
- పేదలకు విద్య, వైద్యం దూరం
- అనుచరులకు దోచి పెట్టేందుకే చంద్రబాబు పన్నాగం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడేలా ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కార్పొరేట్ శక్తుల పక్షాన నిలుస్తూ.. ప్రజల శ్రేయస్సు పట్టించుకోవడం లేదని విమర్శించారు. శుక్రవారం వేంపల్లెలోని కడప - పులివెందుల బైపాస్ రోడ్డులోని మధురెడ్డి కన్వెన్షన్ హాలులో మెడికల్ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరించి, ఆ ప్రతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎక్కడైనా పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తారని, కానీ చంద్రబాబు మాత్రం ప్రభుత్వం వైద్యాన్ని దూరం చేసేలా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. ఎంతోమందికి ప్రాణాలు పోసిన ఆరోగ్య శ్రీ పథకాన్ని దాదాపు ఎత్తేసే పరిస్థితి తెచ్చారని, వైద్య కళాశాలలను ప్రైవేట్ రంగానికి ఇచ్చేస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. తన మంది మాగధులైన పెత్తందారులకు దోచి పెట్టేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించనీయబోమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం సహకారంతో ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల స్థాపనకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. 17 కళాశాలలు మంజూరు కాగా.. వీటిలో ఐదు కళాశాలలు పూర్తయ్యాయని, కొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రజల్లోకి వెళ్లి కోటి సంతకాలు చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించి కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర యాక్టివిటీ జనరల్ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు రవి కుమార్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, బయపురెడ్డి, మండల కన్వీనర్లు చంద్రఓబుల్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీలు గాయత్రి, మాధవి బాలకృష్ణ, చల్లా వెంకట నారాయణ, ఉపసర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, రామలింగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం గాలికి వదిలేసిన ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా నట్టేట ముంచిందని ఎద్దేవా చేశారు. చీనీ, అరటి, ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి ఒక్కో బస్సులో 150 మందిని కుక్కి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరం కాలం అవుతున్నా.. అరకొరగా ఒక సిలిండర్ ఇచ్చి మహిళలను మోసం చేశారని విమర్శించారు. కల్తీ మద్యం రాష్ట్రమంతా ఏరులై పారుతోందన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. కూటమి నేతల మోసాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా పేదలకు వైద్య, విద్య దూరమవుతుందని, భవిష్యత్తులో ప్రజారోగ్యానికి భరోసా ఉండదన్నారు. వైద్యపరంగా పేదలను ఆదుకునేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేశారని గుర్తు చేశారు. కానీ చంద్రబాబు సకాలంలో బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచి పోయాయన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి

శ్రీకృష్ణదేవరాయలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

వర్ధంతి రోజు దండ కూడా వేయని టీడీపీ ముఖ్య నాయకులు

కడప కార్పొరేషన్: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని కాపు నేతలు విమర్శిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించేవారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాన్ని పూలతో అలంకరించి ఘనంగా నివాళి అర్పించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక శ్రీకృష్ణదేవరాయలను పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఫిబ్రవరి 16న శ్రీకృష్ణదేవరాయల జయంతి కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని చెబుతున్నారు. కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అప్పట్లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల కూడా వేయలేదంటున్నారు. తాజాగా శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి కార్యక్రమంలో కూడా టీడీపీకి చెందిన కాపునేతలు గానీ, ఆ పార్టీ ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి లాంటి వారు ఎవరూ పాల్గొని ఆయనకు అంజలి ఘటించలేదు. కాపు, ఒంటరి, తెలగ కులాల వారు ఆరాధ్య దైవంగా భావించే శ్రీకృష్ణదేవరాయలను కూటమి ప్రభుత్వం, టీడీపీ నేతలు పట్టించుకోకపోవడాన్ని ఆ పార్టీలో ఉన్న కాపు నేతలు తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. టీడీపీలో కాపులను చిన్నచూపు చూస్తున్నారని, వారికి పార్టీ, నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎమ్మెల్యేపై తిరుగుబావుటా ఎగురవేసిన టీడీపీ నాయకుల తరహాలోనే కడపలోని టీడీపీ కాపు నేతలు కూడా పయనించే అవకాశాలు లేకపోలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

- మూడు మండలాలు మినహా జిల్లా అంతటా వాన
- అత్యధికంగా అట్లూరులో 69.4 మి.మీ

కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ముద్దనూరు, లింగాల, పులివెందుల మినహా మిగతా 33 మండలాల్లో వర్షం కురిసింది. ఈ వాన చిరుపొట్ట దశలో ఉన్న వరికి కొంత నష్టం కలిగించే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుందూ, పెన్నానది, నీటి వసతి ఉన్న బోర్ల కింద ముందస్తుగా సాగు చేసుకున్న వారికి.. వరుసగా కురుస్తున్న వర్షాలతో గుండె గుబేల్‌మంటోంది. ఎందుకంటే వర్షపు నీరు చిరుపొట్టలోకి చేరితే వరి ఎన్ను తాళ పోయే అవకాశం ఉంది. వెన్ను బయటికి వచ్చిన వరికైతే కంకికి ఉన్న సుంకు రాలిపోయే ప్రమాదం ఉంది. పత్తి, వేరుశనగ రైతులు కూడా కలవర పడుతున్నారు. ఈ వర్షపు నీరు పత్తికాయల్లోకి వెళ్లితే పత్తి కుళ్లిపోయే అవకాశం ఉంది. వేరుశనగ పంటలో నీరు నిలిస్తే ఊడలు ఎర్రగా మారి, భూమిలోకి సరిగా దిగవని రైతులు పేర్కొంటున్నారు. శనగ పంట సాగు చేసుకునే రైతులకు మాత్రం ప్రస్తుతం వర్షం చాలా అవసరం. ఉద్యాన పంటలైన మామిడి, సపోట, చీని, డ్రాగెన్ ఫ్రూట్ వంటి రైతులకు కూడా మేలే.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
అట్లూరు	69.4	చెన్నూరు	14.2
కడప	36.8	సింహాద్రిపురం	12.4
ఒంటిమిట్ట	33.6	కలసపాడు	11.0
సిద్దవటం	30.2	రాజుపాళెం	10.0
గోపవరం	29.2	తొండూరు	9.4
బద్వేలు	23.4	ఖాజీపేట	8.2
సీకే దిన్నె	20.4	వేముల	8.0
వేంపల్లి	20.0	మైదుకూరు	7.8
పెండ్లిమర్రి	19.2	వల్లూరు	6.8
పోరుమామిళ్ల	16.2	జమ్మలమడుగు	6,2
బి.మఠం	15.6	చాపాడు	3.4
మైలవరం	14.6	కమలాపురం	2.4
దువ్వూరు	14.6	కొండాపురం	2.4
బి.కోడూరు	14.2	చక్రాయపేట	1.8
వీఎన్‌పల్లి	14.2	ప్రొద్దుటూరు	1.2

క్లుప్తంగా

సర్పంచ్‌కు గాయాలు



సర్పంచ్ మల్లయ్యను పరామర్శిస్తున్న రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : బొలెరో వాహనం ఢీకొని బక్కన్నగారి పల్లె సర్పంచ్ మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువుల వివరాల మేరకు.. సర్పంచ్ మల్లయ్య పులివెందులలో నుండి తన సొంత పనులను ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నారు. వేంపల్లె నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో మల్లయ్యకు చేయి విరిగి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తీసుకెళ్లారు. మల్లయ్యను వేంపల్లి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి రూ.6.03 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో టెంకాయలను విక్రయించేందుకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది పాల్గొనగా టి.సుమలత రూ.6,03,000లకు టెంకాయల అంగడిని దక్కించుకున్నారు. ఈ ఏడాది నవంబర్ 23వ తేదీ నుంచి 2026 నవంబర్, 22వతేదీ వరకు టెంకాయలు విక్రయించుకునేందుకు ఆమెకు హక్కు ఉంటుందని దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈఓ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. గత ఏడాది వచ్చిన ఆదాయంతో పోల్చితే అదనంగా రూ.1,30,000 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ తనిఖీ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఝరికోనలో మృతదేహం

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె సమీపంలోని ఝరికోనలో గుర్తుతెలియని మృత దేహం ఉందని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. సుమారు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రెండు రోజుల కిందట నీటిలో పడి ఉండవచ్చునని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలింపు



హిటాచీ ద్వారా ఇసుకను టిప్పర్లకు నింపుతూ..

- ప్రతి రోజు వంద టన్నులకుపైగా ఇసుక తరలింపు
- మండల స్థాయి టీడీపీ నాయకుడి అండతో రవాణా

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మండలస్థాయి టీడీపీ నేత అండతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చక్రాయపేట మండలం మారెళ్ల మడక సమీపంలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు రీచ్‌లో భారీగా వర్షపునీరు చేరింది. ఈ పరిణామం చక్రాయపేట మండల టీడీపీ నాయకుడికి వరంగా మారింది. అద్దాలమర్రి చెక్ పోస్టు సమీపంలో అమ్మవారి గుడి వద్ద పెద్ద ఎత్తున ఇసుక అందుబాటులో ఉండడం గమనించి దానిపై ఆ నాయకుడు కన్నేశారు. అనుకున్నదే తడవుగా ఆ ప్రాంతంలో హిటాచీ ఏర్పాటుచేసి నిత్యం వంద టన్నులకు పైగా ఇసుక తరలించేస్తున్నారు. నిత్యం ఇది కనిపిస్తున్నా.. ఇటు పోలీసులు, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. టన్నుల వారీగా వచ్చే ఆదాయంలో వాటాల రూపంలో అందరికీ చేరుతోందనే ఆరోపణలున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మవారి ఆలయం నిర్మించి అక్కడి వరకూ సీసీ రహదారి నిర్మించింది. ఈ ఆలయ సమీపంలోనే తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

మతోన్మాదుల కుట్రతోనే సీజేఐపై దాడి

19న దాడి ఘటనను ఖండిస్తూ సదస్సు



మాట్లాడుతున్న న్యాయవాది సంపత్‌కుమార్

కడప కార్పొరేషన్ : మతోన్మాదుల కుట్రతోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై దాడి జరిగిందని ప్రముఖ న్యాయవాది ఎ.సంపత్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, డా.మల్లె భాస్కర్ ఆరోపించారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ నెల 19న పాతరిమ్స్ ఆవరణంలోని బీసీ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో ఈ సదస్సుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, జన విజ్ఞాన వేదిక ఫౌండర్ డాక్టర్ బ్రహ్మారెడ్డి ముఖ్య వక్తలుగా పాల్గొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అత్యంత దయనీయంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఖజురహో ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదకు సంబంధించిందని, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం మార్పు చేర్పులు చేయడానికి సాధ్యపడదన్నారు. పరిపాలనా పరంగా తిరస్కరణకు గురైన అంశంపై న్యాయస్థానం పరిష్కారం చూపడం సాధ్యం కాదన్న గవాయ్ వ్యాఖ్యల్ని వక్రీకరించి పక్కా ప్రణాళికతో దాడి చేశారన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్న నేపథ్యంలో ప్రజలను చైతన్య పరిచి సమాయత్తం చేయాలనే ఆలోచనతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యావంతులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర శక్తులు సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర అధ్యక్షుడు వెంకటశివ, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహిళపై దాడి

మైదుకూరు : పట్టణంలోని అరుంధతీ నగర్‌కు చెందిన మహిళ గద్దె సుజాతపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసుల కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 11న సుజాత భర్త రవికి, బొచ్చెనపల్లె పాలకొండయ్య, రాజేష్, పెద్ద ఓబులేసుకు మధ్య వాగ్వాదం జరిగింది. అది మనసులో పెట్టుకొని ఈ నెల 14న సుజాతపై ముగ్గురు దాడి చేసి గాయపరిచి అవమానపరిచారు. చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆస్పత్రిలో చేరిన బాధితురాలు అక్కడ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పాలకొండయ్య, రాజేష్, పెద్ద ఓబులేసుపై ఎస్‌ఐ సుబ్బారావు కేసు నమోదు చేశారు.

ఉల్లి పంటను దున్నేసిన రైతు



రోటోవేటర్‌తో దున్నేస్తున్న ఉల్లిపంట

ముద్దనూరు : ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఉల్లి పంటను దున్నేస్తున్నారు. మండలంలోని చింతకుంటకు చెందిన రైతు ఆదినారాయణరెడ్డి ఐదు ఎకరాల్లో తాను సాగు చేసిన ఉల్లి పంటను రోటోవేటర్‌తో ఇలా దున్నేసి మట్టిలో కలిపేశాడు. చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధరలేక, రవాణా వ్యయం భరించలేక దున్నేశానని రైతు తెలిపారు. ఐదు ఎకరాల్లో పంట సాగుకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టానని, చిల్లిగవ్వ రాక ఆర్థికంగా నష్ట పోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు ఆపలేదని మహిళల ఆగ్రహం

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని కొత్త బోయనపల్లె (రాజంపేట మండలం) సమీపంలో ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజంపేట-కడప మధ్య నడిచే పల్లె వెలుగు బస్సును డ్రైవర్ న్యూబోయనపల్లె వద్ద ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో కొందరు యువకులు బస్సును వెంబడించి డ్రైవర్, కండెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. మహిళా ప్రయాణికులు డ్రైవర్ తీరుపై విరుచుకుపడ్డారు. ఉచిత బస్సు ఓవర్ లోడ్‌తో ఉన్నా ఆపాల్సిందేనని ప్రయాణికులు పట్టుబడుతుండడంతో డ్రైవర్, కండెక్టర్లు నిస్సహాయ స్థితిలో చేతులెత్తేస్తున్నారు.

ఇద్దరికి జైలుశిక్ష

ములకలచెరువు/తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ ఆర్.గణేష్ తెలిపిన వివరాల మేరకు.. 2019 డిసెంబర్, 5న ములకలచెరువు పోలీసులకు వచ్చిన సమాచారంతో మదనపల్లె-కదిరి రోడ్డు తంబేపల్లి క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మదనపల్లె నుంచి ఓ టాటా సుమో వాహనం అతివేగంగా వస్తూ పోలీసులను చూసి ఆగింది. ఆ వాహనంలోని ఇద్దరు కర్ణాటక, కోలార్ జిల్లా బంగారుపేట తాలూకా, దొడ్డూరుకు చెందిన నారాయణప్ప శివకుమార్, బంగారు పేట తాలూకా కురబర హళ్లికి చెందిన సుబ్రహ్మణ్యం, మంజునాథ్ పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని 162 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆర్‌డీఎస్‌ఎస్‌తో 24 గంటల విద్యుత్ సరఫరా

ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్



పనులను పరిశీలిస్తున్న సీఎండీ లోతేటి శివశంకర్

మైదుకూరు : గ్రామీణ ప్రాంతాలకు ఆర్డీఎస్ఎస్ (రివేంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)తో 24 గంటల విద్యుత్ సరఫరా చేయవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయప్పగారిపల్లె వద్ద జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రాయప్పగారిపల్లెలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను పరిశీలించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ అనుకూల, గ్రామీణాభివృద్ధి కేంద్రీకృత దృక్పథాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలను ఏపీఎస్పీడీసీఎల్ విజయవంతంగా కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

దువ్వూరు : పీఎం-కుసుం ఫీడర్ సోలార్ విద్యుద్దీకరణ పనులనుఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. దువ్వూరు జగనన్న కాలనీ వద్ద ఐదు మెగావాట్ల సామర్థ్యంతో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. విద్యుదుత్పత్తికి అవసరమైన స్థల సేకరణ, మట్టి పరీక్ష అంశాలపై అధికారులతో సమీక్షించారు. రైతులకు నాణ్యమైన, నిరంతర ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణ, ఈఈలు లక్ష్మీపతి, నాగరాజు, డీఈఈలు శ్రీకాంత్, శివభాస్కర్, ఏఈలు రాజ్‌కుమార్, రామభద్రయ్య, హరి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతిచెందిన రాంబాబు



మృతిచెందిన రెండు గేదెలు

జమ్మలమడుగు రూరల్: మండలానికి చెందిన వల్లెపు రాంబాబు (40) శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని భీమరాయుని కొట్టాల గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చి ఫోన్ తీసే క్రమంలో ప్లగ్ ఊడి వచ్చింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు భార్య వల్లెపు రూపావతి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

తీగలు తగిలి గేదెలు..

వల్లూరు : మండలంలోని భాకరాపురం గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపారు. గురువారం రాత్రి కురిసిన గాలి వానకు భాకరాపురం సమీపంలోని పొలాల్లో విద్యుత్ లైన్లు తెగి నేలమీద పడ్డాయి. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో గ్రామానికి చెందిన టి.నాగేశ్వర్‌రెడ్డి తన గేదెలను మేపడానికి పొలానికి తీసుకువెళ్లాడు. పొలంలో తెగి పడిన తీగలు రెండు గేదెలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మిగిలిన గేదెలను పక్కకు తోలడంతో అవి సురక్షితంగా బయటపడ్డాయి. విద్యుత్ తీగలు తగులుకుని మృతి చెందిన గేదెల విలువ సుమారు లక్షన్నర రూపాయల విలువ చేస్తుందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఆదుకోవాలని బాధిత రైతు నాగేశ్వరరెడ్డి కోరారు.

ఆర్‌ఎంపీ క్లినిక్, ల్యాబ్ సీజ్

మహిళ మృతి కేసులో అధికారుల విచారణ



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మైదుకూరు : ఛాతీనొప్పితో వచ్చిన మహిళకు చేసిన వైద్యం వికటించి మృతి చెందడానికి కారణమైన ఆర్‌ఎంపీ క్లినిక్, ల్యాబ్‌ను వైద్య శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డుకు చెందిన ఓ మహిళ గురువారం మధ్యాహ్నం ఛాతీనొప్పితో బాధపడుతూ అదే రోడ్డులోని మెడికల్ షాప్ నిర్వాహకుడు వద్దకు వెళ్లారు. ఆయన చేసిన వైద్యం వికటించడంతో మహిళ మృతిచెందిన విషయంపై సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, జిల్లా డెమో ఆఫీసర్ భారతి, వైద్యాధికారులు ఎంపీఆర్ మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. షాప్ నిర్వాహకుడు అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీగా క్లినిక్, ల్యాబ్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్ఓ నాగరాజు ఆదేశాలతో మెడికల్ షాప్, క్లినిక్‌ను సీజ్ చేసి డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశామని డెమో అధికారి భారతి తెలిపారు. ఈ తనిఖీల్లో మెడికల్ ఆఫీసర్ ఎస్.ఆయేషా, డిస్ట్రిక్ట్ లీగల్ కన్సల్టెంట్ ఎం.పాలేశ్వరరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు ఎం.మరియాకుమారి, ఆర్.వెంగళరెడ్డి, టి.జయప్రకాష్, కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం యశోద పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి



ఆర్‌ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని, అనుమతి లేకుండా మెడికల్ షాపులు, క్లినిక్, ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు నడిపితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుని సీజ్ చేస్తాం. కడప రోడ్డులో ఆర్‌ఎంపీ ముందు వైపు మెడికల్ షాపు నిర్వహిస్తూ లోపల ఆర్‌ఎంపీ క్లినిక్‌ను నడుపుతున్నారు. మందుల కోసం వస్తే లోపల డాక్టర్ ఉన్నాడంటూ పంపుతున్నారు. ఆర్‌ఎంపీలు ఇంజెక్షన్ చేయవద్దని, సెలైన్లతో చికిత్స చేయొద్దని చాలాసార్లు హెచ్చరించాం. ఆస్పత్రి బోర్డులో ఒకరి పేరు కనబరిచి.. మరొకరు వైద్యం చేయాలంటే వైద్య సమయాలను సూచిస్తూ అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– భారతి, జిల్లా డెమో అధికారి

విద్యార్థులకు జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్ : నేషనల్ సైన్సు సెమినార్ జిల్లా స్థాయి పోటీలలో దువ్వూరు కేజీబీవీకి చెందిన షఫియా, సికె.దిన్నె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జాస్మిన్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలను ఎంపికయ్యారు. కడపలోని అంధుల ఉన్నత పాఠశాలలో జరిగిన నేషనల్ సైన్సు సెమినార్‌లో డీఈఓ షేక్ షంషుద్దీన్, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి వేపరాల ఎబినైజర్ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్వాంటమ్ ఏజ్ బిగిన్స్, పొటెన్షియల్ అండ్ చాలెంజెస్‌పై చాట్స్, స్లైడ్స్ ద్వారా పోటీలు జరిగాయన్నారు. ఎంపికైన విద్యార్థులు రెండు రోజుల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు, వైద్య సిబ్బంది

మైదుకూరు : విద్యార్థులు సీపీఆర్(కార్డియో పల్మనరి రిసిస్టేషన్)పై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. వనిపెంట జ్యోతిరావు పూలే గురుకులం, మైదుకూరు కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. డీఎంహెచ్ఓ నాగరాజు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్సగా ఉపయోగపడే సీపీఆర్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. సీపీఆర్‌తో వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. పరిశుభ్రతతో వ్యాధులబారిన పడకుండా ఉండవచ్చని, సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడవ వలన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆడ పిల్లలను రక్షించడం, చదివించడం ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డెమో డి.భారతి, మెడికల్ ఆఫీసర్ సుమధుర, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ విజయ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో స్వయం ఉపాధి

కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్



మాట్లాడుతున్న డాక్టర్ అంకయ్యకుమార్

కడప అగ్రికల్చర్: చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందవచ్చునని ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్. అంకయ్యకుమార్ పేర్కొన్నారు. ఊటకూరు కేవీకేలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, లేబులింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేయడమేగాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేరుస్తాయని తెలిపారు. ఇటీవల కాలంలో యువత చిరుధాన్యాల ఉత్పత్తి సంస్థలను స్థాపించడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వారికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మార్కెట్‌లో ఉత్పత్తులకు గుర్తింపు పొందేలా ఆకర్షణీయమైన లేబుల్స్, సరైన ప్యాకేజింగ్, నాణ్యత ప్రమాణాలు అత్యంత ముఖ్యమని వివరించారు.

చెరువులో పడి ఒకరు మృతి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ మండలం శిబ్యాల పరిధిలోని కానుగ చెరువులో పడి పఠాన్‌మున్నా (40) శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. శిబ్యాల గ్రామం (చెరువుకు దగ్గరగా ఉన్న ఊరు)లోని తన ఇంటి నుంచి గేదెలను మేపేందుకు పఠాముున్నా వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ సాగించారు. ఏదైనా ప్రమాదం జరిగి ఉంటుందని భావించి చెరువులో గాలించి మృతదేహాన్ని గుర్తించారు. గేదెలు మేస్తూ చెరువులోకి వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. లోతైన గుంటలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసంవాద బ్యాంకు ఖాతాలను నిర్వహణలోకి తీసుకురావాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : భారత ప్రభుత్వం అసంవాదనీయ(అన్ క్లెయిమ్డ్) బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, బీమా, పొదుపు పథకాల నిధులు నిజమైన హక్కుదారులకు చేరేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో నిరుపయోగంగా ఉన్న అసంవాద (అన్ క్లెయిమ్డ్) అకౌంట్లను తిరిగి నిర్వహణలోకి తీసుకువచ్చే ఉద్దేశ్యంతో చేపట్టిన అవగాహన కార్యక్రమ బ్రోచర్లను కలెక్టర్ శుక్రవారం విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచారం ప్రారంభించి.. ఆ అకౌంట్లను యాక్టివేట్ చేసేలా బ్యాంకర్లు చురుకైనపాత్ర పోషించాలన్నారు. బ్యాంకు కంట్రోలర్లు, సమన్వయకర్తలు తమ శాఖలను చైతన్యపరచి, బధిర ఖాతాదారులకు లేఖలు/ ఎస్ఎంఎస్‌లు పంపించాలని సూచించారు. అన్ని బ్యాంకులు ఆయా శాఖలలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించి నిజమైన హక్కుదారులకు తిరిగి చెల్లించాలన్నారు. బ్యాంకులు తమ కస్టమర్లు, లేదా డిపాజిటర్లను ప్రోత్సహించి డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్(డీఈఏ)ఫండ్‌లో ఉన్న అసంవాదనీయ డిపాజిట్లను నిజమైన హక్కుదారులకు ఇవ్వడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం జనార్దనం, సీపీఓ హజరతయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా టపాసులు విక్రయించవద్దు

ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



షెల్కే నచికేత్ విశ్వనాథ్, వైఎస్సార్ జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వఉంచినా, విక్రయించినా పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్‌విశ్వనాథ్ పేర్కొన్నారు. ప్రజలు, పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులకు శుక్రవారం ఆయన దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టపాసుల విక్రయదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సూచించిన బహిరంగ ప్రదేశాలు, వారికి కేటాయించిన ప్రాంతంలో నిర్ణీత కొలతల మేరకు దుకాణాలు ఏర్పాటుచేసుకుని , లైసెన్సులు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయించాలన్నారు. లైసెన్సు పొందిన గోదాములు, దుకాణాలు, తాత్కాలిక దుకాణదారులు తూచాతప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాలకు తావు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని ఎస్పీ సూచించారు. షాపు, షాపుకు మధ్య నిర్దేశించిన దూరం తప్పనిసరిగా పాటించాలని, ప్రతి దుకాణంలోనూ నీరు, ఇసుక, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ ఉంచినా, విక్రయించినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దీపావళి రోజున జాగ్రత్త..

దీపావళి పర్వదినం జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. చిన్న పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితంగా పండగ జరుపుకోవాలని కోరారు. కాటన్ దుస్తులు ధరించి చిన్నారుల తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చాలని సూచించారు. రోడ్డు వెంబడి వెళ్లే వాహనాలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చుకోవాలని, బకెట్‌లో నీరు ఉంచుకొని జాగ్రత్త ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గాయాలైతే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఇంటి లోపల బాణసంచా కాల్చకూడదని, సగం కాలిన వాటిని మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయడం, ముట్టుకోవడం ప్రమాదకరమని అన్నారు. ఆస్పత్రుల వద్ద బాణాసంచా కాల్చరాదని ఎస్పీ సూచించారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, టపాసులు విక్రయిస్తున్నా సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.